"అవితే భోగరాజు నీకొక్కడలా ?" అన్నాడు స్టేషన్ మాస్టర్. "కాదండీ ! నాకు బిడ్డల్లేరు. ఇవన్నీ మాయవరసలు" అంటూ టిక్కట్టందిచ్చింది ఈమె నవ్వుతూ. భోగరాజు బండి లోంచి తొంగిచూస్తూ "అత్తా ! మఱచిపోకేం" యంటూ మరో సారి మఱపించే చిరునవ్వు లోలో నవ్వుకుంది.

అంతలో అసలు హాల్టు వచ్చిందింక. రైలుదింపేదు భోగరాజుకు లైన్‌మాన్ స్వాగతమిస్తూ.

గార్డు "నీ పెళ్ళామా ?" అన్నాడు. భోగరాజుకు నవ్వొచ్చింది. "అలా యడుగుతాదేమిటి అన్నీ ఎఱిగివున్న గార్డే మళ్ళా" అని తల్లివెనక నిలబడి పూరానవ్వు నవ్వింది.

తల్లి "నవ్వకే మాఅమ్మా ! వెళ్లేది అత్తింటికి !" యని అనేదాకా ఒకేనవ్వు నవ్వింది !

.... .... .... .... ....

## పంట్, పండు, కాయ్, కసవు....

రయితిలా ఉంటాడని వర్ణించ నక్కఱలేదు. తోటిలా ఉంటుందని వివరించ నక్కఱలేదు. ఎంచేతా యంటే హిందూదేశంలో ముప్పాతిక మువ్వీసపు జనం వ్యవసాయదార్లే. హిందూదేశంలో నగభాగపు భూమి సాగుబడి సుక్షేత్ర ఖండికలే. అందులోనూ ఒక్కొక్క తోటన్నది వుందా యంటే ఎకరం మూడువేలు నాలుగువేలు కూడా ఖరీదు చేస్తుంది. రయితంటూ ఉన్నాడా యంటే అతడూ యతని భార్యాకూడా తరతరాలుగా అమరకానికి పుచ్చుకుని యదే రాబట్టడం—పంట, పండు, కాయ, కసవు....

అలా పేరుమోసి వ్యవసాయం చేసే దంపతుల్లో ప్రప్రథమ శ్రేణికి చెందిన వాళ్ళు తోటడు, వాని పెళ్ళాం ముత్యాలమ్మాను. వాళ్ళిద్దఱూ జేజెయ్యగారి తోట కవులుకు తీసి కొన్నాక రెండు బహుధాన్యాలు గడచినాయంట.

జేజెయ్యగా రిప్పుడు పొలంలోకి రావడంలేదు. కాని తోట పేరు జేజెయ్యగారి తోట అన్నది ఆచంద్రార్కం నిలిచిపోయి ఇప్పటికీ అమల్లోవుంది. జేజెయ్యగారు పొలంలోకి రానప్పట్నుంచీ తోటడికీ ముత్యాలమ్మకూ ఆ తోట తమ సొంతతోట యనే భావం బాగా ప్రబలిపోయి, తమకు తోచిన కొత్తచెట్లు పాత్తూ తమకు పనికిరావన్న పాతచెట్లు నఱికి పారేస్తూ—గిద్దెడు రూపాయలు కడిగి చేతిలోపోసినట్టు పోసేవారు ఈనాందారు చేతిలో—లేనప్పు డదీ లేదు. జేజెయ్యగారు అడిగేవారూ గాదు. అలా అడక్కపోవడానికి కారణంవుంది.

జేజెయ్యగారికి—రాజయ్య, బొజ్జయ్య, ఇద్దఱు కొడుకు లుండీ—ఇద్దఱూకూడా, జేజెయ్య యలా హరీ యనేటప్పుడు ఇలా ఈ తోట పంచేసుకోవడానికి ఏర్పాటు చేసికొన్నారు. మఱెందుకు జేజెయ్య ? మఱెందుకు జేజెయ్యకు కాపీనము ? తను పంచక్కర్లేదు కొడుకులకు. కొడుకుల్ని మఱి పెంచక్కర్లేదు.

అయితే జేజెయ్య, ఇంటివద్ద హరీ యన్న సంగతి తోట లోని తోటయ్యకూ ముత్యాలమ్మకూ తెలియద మెట్లా ? ఎవరి క్కావాలి వాళ్ళకు వర్తమానించేందుకు, అక్కడ జేజెయ్య ఈ లోకాన్ని విడిచిపోతూ ఉంటే ఇక్కడ తోటలో చెట్లకేమన్నా ఇంగితం వుండి ఏపుతగ్గాయా ? రూపు చెడ్డాయా ? పూరు దుల్చాయా ? పూత మాడాయా ? 'ఎలా ఉండే నందనవనం

అలా నందనవనంలా వుంది. తోటయ్యకూ ముత్యాలమ్మకూ వారి మామూలు కాపరాని క్కొదవలేకుండా ఆ ముహూర్తం గడచిపోతూనే వుంది. ఆ క్రితం పొద్దు ఎట్టి సంతోషంతో ఎట్టి పంతంతో పాటుబడ్డారో ఆ పొద్దు జేజెయ్య సమాధిని పడేటప్పుడు కూడా గొప్ప తవ్వుకుంటూ పప్పుతింటూనే ఉన్నారు. తోటడూ ముత్యాలమ్మానూ।

మలి పొద్దు చూచుకోండి తమాషా! కరణంగార్ని గొలుసు సహా అఫ్‌సెట్టు ఊచసహా లాక్కొచ్చి, రాజయ్య బొజ్జయ్య తోట రెండు సరిసమాన భాగాలుగా విడదీసుకొంటూ-ఏర్రా ఈ తోటలో ఉండేవాళ్లు ఏర్రా అంటూ—మధ్య మధ్య నెమకుతూ ఉన్నారు. తోటడూ ముత్యాలమ్మా. ఆ పచ్చితోటంట అల్లటీ చిల్లటిగా కొలుస్తూవున్న వాళ్ళ కంటబడ్డం లేదు, తమ ఊర్పులన్నా పైకి తేలించి వినిపించడం లేదు కదా.

"ఒరే తోటగా! ఓసి ముత్తీ!"—పైవాళ్ళ అఱుపుల్తో తోట మాఱుమోగుతూ ఉంది. మాఱుమోగిందే కాని ఎదురు జవాబు లేదు. మాఱుమోగింది కూకేసే వీళ్ళ గొంతే!

వెట్టివాళ్లు లాగుతున్నారు గొలుసు. కరణం అఫ్‌సెట్టు పెట్టి చూస్తున్నాడు—ఎండవేళ చల్లగా ఉంటుంది గదా తోటలో నని అప్పుడు తీఱిక చేసుకుని కొలుస్తూ విభాగిస్తూ ఉన్నారు. రాలుటాకుల్లోంచి ఇనుపగొలుసు పోతూవుంది. మొవ్వుటాకుల్లోంచి కరణం చూపానుతూ వుంది.

"ఇదేంట్రా జర్రిగొడ్డులా జఱజఱమంటా వుంది" అంది ముత్యాలమ్మ తోటడితో వోమూల. తోటడు "అదేనే! కరణం గొలుసు! అదిగో సూడు అదిసూపు!. ఎంతసేపూ

నా వొంకే ఉన్నట్టుంది !" "ఆ సూపెందులో పెట్టి సూస్తున్నా దంటావు—నా వంకా సూస్తువున్నట్టే ఉందిరా ! అద్దమెట్టి కాదు గదా ?"—" అద్దం లేదు గిద్దంలేదు విమ్మా నమ్మా ఓలైనులో నిలబడమంటున్నారే ! లెగు ! లెగు ! దాక్కాని మటి మనం కక్కుర్తిపడి ప్రయోజనం లేదు. లెగు ! లెగు ! నాతో ఓ వరసలో నిలబడు ! ముత్తీ ! లెగు ! లెగు ! పంచుతున్నారు తోట !"

ముత్తి "నే లెగలేను. లెగలేను, నీకూ నాకూ పంపక మేంట్రా ? నే లెగలేను ? నిన్ను లెగనివ్వను.

ఈ పొద్దీతోటలోంచి లెగనివ్వను !" ఈ రైను కద్దంగా నడ్డి లొంచుకు అలాగే ఉండిపోయినారు తోటడూ ముత్యా లమ్మానూ !

వాళ్ళ పాదాల క్రింద నుంచి జలజలా వొరుసుకుంటూ వెళ్ళిపోయింది. ఇనపగొలుసు, వాళ్ళ నెఱపిన తల వెంట్రుకల చిక్కుగుండా కరణం చూపు మిఱుమిట్లు గొంది.

ఒక్కడూ లైన్నిబ్బరం వూహించిన వాడేలేడు ఆ సమ యాన్ని. అందఱూ మఱి తోటణ్ణీ మఱిముత్యాలమ్మనూ కొలిచినవాళ్ళే.

.... .... .... .... ....

## గార్హస్త్య సుకాంతి

నలుగురాడవాళ్ళెక్కడ కూర్చుంటే అక్కడే ఆదో ఇల్లను కోండి. అందులోనూ వాళ్ళతోపాటు పదిమంది పిల్లలూ చంటి